క్లుప్తంగా

కల్వర్టుల తనిఖీలు

అశ్వాపురం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అశ్వాపురం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్సైలు సురేష్, జితేందర్‌ల ఆధ్వర్యంలో మండలంలో ప్రధాన రహదారి వెంబడి కల్వర్టుల్లో తనిఖీలు చేశారు. మొండికుంట గ్రామం నుంచి కల్యాణపురం గ్రామం వరకు మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి ఉన్న కల్వర్టులో పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ మధ్య కాలంలో మావోయిస్టులు మందుపాతరలు, ఇతర బాంబులు అమర్చుతున్న నేపథ్యంలో రహదారులు, కల్వర్టుల తీరును పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

లోఓల్టేజ్ సమస్యకు చెక్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గురువారం విద్యుత్‌శాఖ అధికారులు నూతన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించినట్టైంది. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం కార్యక్రమంలో డీఈ జీవన్ కుమార్, ఏఈ మైత్రి, లైన్మెన్ త్రినాథ్ రెడ్డి, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

పునర్వసు కల్యాణం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరాముని జన్మ నక్షత్రం సందర్భంగా ప్రతి నెలా నిర్వహించే పునర్వసు కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషం కిరణ్ కుమారాచార్యులు, ప్రతాపురం భార్గవాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను కల్యాణతంతు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పుర వీధుల గుండా స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతర

దుమ్ముగూడెం: మండల పరిధిలోని చింతగుప్ప గ్రామం వెలుపల ఛత్తీస్‌గఢ్ బోర్డర్‌లో ఊకే వారి వేల్పుల జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ జాతరకు పెద్ద ఎత్తున మూడు రాష్ట్రాల వంశస్తులు ఊకే, జిమ్మ, గొంది, అక్కిపల్లి, జలకం ఇంటి వారసులు హాజరయ్యి తూలి తల్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో తలపత్తులు ఒకే చంద్రయ్య, వేల్పుల పూజారి ఊకే శంకర్, బాలయ్య, రాజబాబు, నరసింహారావు, నాగేశ్వరరావు, యడమత్రి, కుంజ నాగయ్య, నరసింహారావు, ఆర్తి బిడ్డ నరసింహారావు, ఎంపీపీ రేసు లక్ష్మి, సర్పంచ్, ఎంపీటీసీ, ఊకే వంశస్థులు తదితరులు పాల్గొన్నారు.

కుర్రాజుల ఉత్సవం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ముదిరాజ్ బజారులో స్థానికులు కుర్రాజులు కొలువుగా పిలుచుకునే ఉత్సవాన్ని గత ఐదు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అడవి నుంచి సర్లు అనే వనదేవతలను ఊరేగింపుగా తీసుకొచ్చి కుర్రాజుల పందిరి మీదికి ఎక్కించి తెల్లవారు ఉత్సవాన్ని నిర్వహించారు. నేడు ఓలా వనదేవతలుగా పరిగణించే సర్లను నిప్పుల గుండంగా మార్చి ఉదయం 6 గంటలకు పవిత్ర గోదావరి నది తీరంలో స్నానం ఆచరించి ఆ నిప్పుల గుండంలో నడుస్తారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు గురువారం లెక్కించారు. గత నెల 24వ తేదీ నుంచి ఈ నెల 27వ తేదీ వరకు రూ.99వేల291 సమకురినట్లు దేవదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకుడు పి.బెయిల్ సింగ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పొడియం సత్యవతి, ఆలయ చైర్మన్ బిర్రం రమాదేవి, ఆలయ మేనేజర్ బి.సూర్య ప్రకాశ్‌రావు, కమిటీ సభ్యులు లోకం అశ్విని కుమార్, నాగమహేశ్వరరావు, తూతుకు మాధవి, అర్చకులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

మణుగూరురూరల్: మండల పరిధిలోని చిక్కుడుగుంట గ్రామానికి చెందిన మాటూరి సాంబశివరావు పూరిగుడిసె ఇటీవలే అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోగా.. నిరాశ్రయులైన ఆ కుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ పినపాక నియోజకవర్గ మహిళా నాయకురాలు పోలెబోయిన శ్రీవాణి పరామర్శించారు. అనంతరం 25కేజీల బియ్యం, కొంత నగదును వితరణగా అందజేశారు. కార్యక్రమంలో గట్ల శ్రీనివాస్‌రెడ్డి, గంగిరెడ్డి బ్రదర్స్, మునిగెల శేఖర్, బతకయ్య, బత్తుల వెంకటేశ్వరరెడ్డి, మునిగెల కల్యాణ్, సంజీవరెడ్డి, చీకటి సత్యం, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీకే ఓసీ సెక్షన్–2 క్యాంటిన్‌లో కాంట్రాక్టు కార్మికురాలు(కుక్)గా పనిచేస్తున్న చాపత్తుల జ్యోతి అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఓసీ–2లోని సీ రిలే ఉద్యోగులు గురువారం ప్రాజెక్టు మేనేజర్ దండమూడి రాంబాబు చేతుల మీదుగా రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. టీబీజీకేఎస్ నేత వి.ప్రభాకర్‌రావు, రక్షణ అధికారి లింగబాబు, బి.భాంగ్యా, బాబ్జీ, కృష్ణమూర్తి, శ్రీనివాస్, దేవేష్, సూర్య, సింగరేణి సేవా సమితి సభ్యులు నాజర్‌పాషా, శంకర్, అబ్దుల్‌రవూఫ్, కపా శివాజీ, అశోక్, మేకల ఈశ్వర్, తిరుపతి, గట్టయ్య, బంగారయ్య, కుమారస్వామి, యాకయ్య, బాబులాల్, అంజయ్య, అహ్మద్, సురేష్, సుదర్శన్‌రావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

‘వేసవి’ దొంగలతో జాగ్రత్త!

- తాళం వేసిన ఇళ్లే వారి టార్గెట్
- ఆరుబయట నిద్రించే వారి గృహాలపై ఫోకస్
- పగలు పరిశీలన.. రాత్రి పనిపూర్తి



పెద్దనల్లబల్లి గ్రామంలో ఆలయ హుండీని ధ్వంసం చేసిన దుండగులు



రైస్ మిల్లులోని ఓ వ్యక్తి వద్ద దొంగతనం చేస్తూ సీసీ కెమెరాకు చిక్కిన దుండగుడు

దుమ్ముగూడెం: వేసవి అంటే కేవలం ఉక్కపోత, వడదెబ్బే కాదు.. చోరీలు కూడా జరుగుతాయి. ఈ సీజన్‌లో ఉండే అవకాశాలను ఉపయోగించుకుంటూ చోరులు స్వైరవిహారం చేస్తుంటారు. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతుంటారు. వేసవిలో సెలవులపై ఎక్కువ రోజులు ఊర్లకు వెళ్లేవారి ఇళ్లపై దొంగల కన్ను పడుతోంది. విద్యార్థుల పరీక్షలు పూర్తికావడం, పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో దైవదర్శనాలకు, విహార యాత్రలకు ప్రజలు మొగ్గు చూపుతుంటారు. రోజువారి ఒత్తిడిలో తలమునకలై ఉన్న వారంతా తమ సొంతూళ్లు, విహారయాత్రలకు వెళ్లేందుకు సిద్ధమవుతుంటారు. ఈ సమయంలోనే దొంగలు మీ ఇళ్లను లూటీ చేసే ప్రమాదముంది. కాస్త నిర్లక్ష్యం చేసినా ఏళ్ల తరబడి దాచుకున్న సొత్తు దొంగలకు అప్పగించినట్లే.

ఈ కాలంలో ప్రజలు రాత్రి వేళల్లో సేదతీరడానికి ఆరుబయట, డాబాలపై పడుకోవడం చేస్తుంటారు. ఆ సమయంలో దొంగలు ఇళ్లను లూటీ చేసే ప్రమాదముంది. మరోవైపు ఇంట్లోనే కూలర్, ఫ్యాన్లు వేసుకుంటారు. ఈ శబ్దాలకు పక్కింట్లో ఏం జరుగుతుందో తెలిసే వీలుండదు. దీన్నే అదునుగా చేసుకుని దొంగలు ఇంట్లో ఉన్న విలువైన అభరణాలను, వస్తువులను ఇట్టే చోరీ చేస్తున్నారు.

ఘటనలు ఎన్నో..

ఈ మధ్య కాలంలో మండలంలో జరిగిన వరస దొంగతనాలు ఎన్నో ఉన్నాయి. సుజ్ఞానపురం గ్రామంలోని ఆలయంలో గునపంతో తాళాలు పగులకొట్టి ఆలయంలోని హుండిని పగులకొట్టి అందులో నుంచి సుమారు రూ.25వేల నగదును దోచేశారు. మరుసటి రోజు పెద్దనల్లబల్లి రోడ్డుపై ఉన్న శ్రీ ముత్యాలమ్మ ఆలయంలోని హుండీని తెరిచేందుకు ప్రయత్నించారు. అలాగే పెద్దనల్లబల్లి గ్రామంలో ఉన్న ద్విచక్ర వాహనాల రిపేరింగ్ దుకాణంలో హోండా షైన్ వాహనాన్ని ఊరి చివరకి తీసుకుని వెళ్లి బ్యాక్ టైర్ దొంగిలించారు. అలాగే అంజిపాక క్రాస్ రోడ్డులో ఉన్న షోడా షాప్‌లో గ్యాస్ సిలిండర్, మొబైల్ ఫోన్, పక్కనే ఉన్న రైస్ మిల్లులో వరిపొట్టు లోడ్ కోసం వచ్చిన వారి మొబైల్ ఫోన్, మిషన్ భగీరథ ప్లాంట్‌లోని కార్మికుడి ఫోన్, మరుసటి రోజు పర్ణశాల విద్యుత్ సబ్ స్టేషన్‌లో రెండు ఫోన్లు, రూ.10వేల నగదు, బైరాగులపాడు గ్రామంలో ఫిట్టర్ ఇంజన్‌ను దొంగలు తస్కరించారు.

అంతా యువకులే..

దొంగతనాలకు పాల్పడే వారిలో ఎక్కువ మంది యువకులే ఉన్నారు. సీసీ కెమెరాలను పరిశీలించినప్పుడు ఈ విషయం స్పష్టమౌతోంది. ద్విచక్ర వాహనాలపై అర్ధరాత్రి సమయాల్లో వచ్చి చటుక్కున వారు అనుకున్న పని కానిచ్చేసి వెళ్లుతున్నారు. ఇందుకోసం ఉదయం పూట పరిసరాలను పరిశీలించి వెళుతున్నారు. మద్యం మత్తుకు, ఈజీ మనీకి అలవాటు పడిన వారు ఈ ఘటనలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో అనుమానస్పదంగా కొత్తవారి కదలికలు ఉంటే వెంటనే వారిని ప్రశ్నించి అనుమానం వస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేస్తే ఇటువంటి దొంగతనాలను కొంత మేరకు అరికట్టవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఊరెళ్లాల్సి వస్తే విలువైన బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి. లేదా తమ వెంట తీసుకువెళ్లాలి. ఊరికి వెళ్లే ముందు దగ్గరలోని పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలి. కాలనీలలో అనుమానాస్పద, గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే వారి కదలికలను బట్టి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. వాహనాలను ఇంటి ఆవరణలో నిలిపి ఉంచుకోవాలి. అవకాశం ఉన్న వాళ్లు ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని పర్యవేక్షిస్తుండాలి. ఈ జాగ్రత్తలతో కొంత మేర దొంగతనాలు నివారించవచ్చు.

సమాచారం తెలియజేయండి

ఏజెన్సీ ప్రాంతం కావడంతో రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేసే అవకాశాలు తక్కువగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఎవరికివారు అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా ఉంటే వెంటనే సమాచారం పోలీస్‌స్టేషన్‌కు చేరవేయాలి. తద్వారా ఇటువంటి దొంగతనాలను అరికట్టే అవకాశాలున్నాయి.

– దోమల రమేష్, సీఐ

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీరయ్య

చర్ల: అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని కుదునూరు, సత్యనారాయణపురం, తేగడ, చర్ల, దోశిళ్లపల్లి, మొగళ్లపల్లి, చినమిడిసిలేరు, పెదమిడిసిలేరు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి.. ఇటీవల వర్షాల మూలంగా దెబ్బతిన్న వరి, మిర్చి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దెబ్బతిన్న పంటలను పూర్తి స్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ విషయంలో ఏ మాత్రం తాత్సారం చేసినా ఊరుకునేది లేదని, రైతుల పక్షాన ఆందోళనలను నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, ఎంపీపీ కోదండ రామయ్య, ఎంపీటీసీ సభ్యులు మడకం పద్మజ, ముత్యాల స్వాతి, సర్పంచ్‌లు సోడి చలపతి, ఎలకం నరేంద్ర, సహకార సంఘ సభ్యుడు బందారు రామకృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు చీమకుర్తి వీరభద్రం, ఇందుల బుచ్చిబాబు, మేడిచర్ల వీరకుమార్, గూడపాటి సతీష్‌కుమార్, ఆవుల పుల్లారావు, సుందరి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిరసన



ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న కొమరంభీంనగర్ గ్రామస్తులు

ములకలపల్లి: తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని కోరుతూ వలస ఆదివాసీలు రోడ్డెక్కారు. చెలమ నీటిలో దాహార్తి తీర్చుకుంటూ నెలలు గడుస్తున్నా అధికారులు స్పందించని తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ ఖాళీ బిందెలతో బైఠాయించారు. మండలపరిధిలోని కొమరంభీం నగర్‌లో 15 గుత్తికోయ కుటుంబాలు గత ఇరవై ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాయి. వీరికి తాగునీటి కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి సౌరవిద్యుత్ ఆధారిత పంపు (సోలార్ యూనిట్) ఏర్పాటు చేశారు. అయితే దీని ప్యానల్ బ్యాక్స్ అపహరణకు గురికావడంతో సుమారు 10 నెలలుగా నిరుపయోగంగా మారింది. దీంతో వలస ఆదివాసీలు సమీప వాగుల్లోని చెలమ నుంచి నీటిని తెచ్చుకుంటూ వాడుకుంటున్నారు. ఇప్పటికీ అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో గురువారం గ్రామస్తులు ములకలపల్లి, మంగలిగుట్ట రహదారిపై ఖాళీబిందెలతో బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ సభ్యుడు నిమ్మల మధు మాట్లాడుతూ.. సత్వరమే తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గొత్తికోయల గ్రామమైన ఉడుములబండ సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. నందిపాడు, దురదపాడు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీటీసీ పండా రాజు నివాసంలో ఉడుములబండ గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి తమకు విద్యుత్, తాగునీరు, రోడ్ల సమస్యలు ఉన్నట్లు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామస్తుల ఎదుటే ట్రాన్స్‌కో డీఈకు ఫోన్ చేసి విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అంచనా వేసి ప్రతిపాదనలు చేయాలని, ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు ఉన్నారు.

నర్సరీలోని మొక్కలను సంరక్షించాలి



నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్

అన్నపురెడ్డిపల్లి: వేసవికాలం దృష్ట్యా నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని నర్సరీని, డంపింగ్ యార్డ్‌లను ఆయన గురువారం పరిశీలించారు. మొక్కల పెంపకంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాల్లోని చెత్తాచెదారం లేకుండా డంపింగ్ యార్డ్‌కు తరలించి.. అక్కడ కంపోస్ట్ ఎరువును తయారు చేయాలని సూచించారు. ఎంపీఓ షబ్నా, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మీయా, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాలు పంపిణీ



సబ్సిడీపై కల్టివేటర్ యంత్రాన్ని అందిస్తున్న విఘ్నేష్ కుమార్

అశ్వారావుపేటరూరల్: గ్రామీణ వ్యవసాయ అభివృద్ధి సంఘం(ఆర్‌ఏడీఎస్) ఆధ్వర్యంలో గురువారం రైతులకు సబ్సిడీలపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక డీసీసీబీ బ్యాంక్ వద్ద ఉన్న కిసాన్ పరివార్ ఫౌండేషన్ సహకారంతో ఆర్‌ఏడీఎస్ చైర్మన్ గజ్జల విఘ్నేష్ కుమార్ 50 శాతం రాయితీలపై కల్టివేటర్లు, ఇతర పరికరాలను అందజేశారు. ఎంపీటీసీ వేముల భారతి, సంస్థ బాధ్యులు జైరాం ప్రసాద్, సీఈఓ గుజ్జా సుబ్బారావు, మడివి నాగరాజు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

అశ్వాపురం: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నాయకులు గురువారం మండలంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆనందాపురం, బీజీ కొత్తూరు, మల్లెలమడుగు, గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కోడి అమరేందర్, మత్రి మల్లారెడ్డి, నెల్లిపాక ఎంపీటీసీ గాదె జయ, నెల్లిపాక పీఏసీఎస్ డైరెక్టర్ కాసరబాద సందీప్, నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, చిలకా వెంకటరామయ్య, ఏనుగుల సత్యనారాయణ, డాక్టర్ బాబు, సోమ వెంకటరెడ్డి, మామిడి శ్రీను, ఉప్పల్ రెడ్డి, ముత్యాల నరసింహారావు, కాట్రాజు కొండలు, మహేష్, బెల్లి పురుషోత్తం, గాదె వెంకటేశ్వర్లు, పున్నారావు, హుస్సేన్, వేణు, దాసు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో గురువారం నుంచి శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎంపీటీసీ సభ్యురాలు మారుతి లలిత, సంఘం మండల అధ్యక్షుడు ముచ్చర్ల లక్ష్మీనారాయణ, ఆలయ అధ్యక్షుడు శ్రీగల సోమలింగాచారి, ఉపాధ్యక్షుడు వెంకటరత్నాచారి, అర్చకులు నిరంజన్‌చారి, జైబాబు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ములకలపల్లి: తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు పొడియం వెంకటేశ్వర్లు, గౌరి నాగేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని తిమ్మంపేట, కొత్తగంగారం గ్రామాల్లో గురువారం నిర్వహించిన సంఘ సమావేశాల్లో వారు మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన

మణుగూరు మండలంలోని ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలు చేపట్టిన సమ్మె గురువారం 11వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా ఆయా దీక్షా శిబిరాల్లో వీఓఏలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వీరికి పలు పార్టీలు, సంఘాల నాయకులు మద్దతు నిచ్చారు. దీక్ష శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం తెలిపారు. వీఓఏలకు కనీస వేతనం చెల్లించాలని, బీమా, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: దీక్షా శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న వీఓఏలు



ములకలపల్లిలో..



అశ్వారావుపేటలో..

జిల్లా జడ్జిని కలిసిన ‘బార్’ అధ్యక్షుడు

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన పాటిల్ వసంత్‌ను కోర్టు సముదాయంలో గురువారం భద్రాచలం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కోట దేవదానం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. న్యాయవాదులు కొడాలి శ్రీనివాసన్, సున్నం రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటు

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ మడకం వారి వీధి వారు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతుండగా.. స్పందించిన సర్పంచ్ ప్రసాద్ ఆ వీధిలో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి తద్వారా నీటిని అందించారు. పైప్‌లైన్ ఏర్పాటు చేసిన సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీలు కోటేశ్వరరావు, తాటి సరిత, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిలకు వీధి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

హామీలు నెరవేర్చాలి

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆ మాట్లాడుతూ.. ప్రజా పోరుయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తంగెళ్ళమూడి శివ, దస్తగిరి, సత్యనారాయణ, ధర్మ, జాన్‌బీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రద్దు ప్రకటన సరికాదు

ములకలపల్లి: ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని టీపీసీసీ సభ్యురాలు, జెడ్పీటీసీ సున్నం నాగమణి అన్నారు. మండలపరిధిలోని మాధారంలో కాంగ్రెస్ మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు ఎండీ.అంజుంతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రిజర్వేషన్లు రద్దు అంశాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆమె తెలిపారు.

మృతుడికి నివాళి

అశ్వాపురం: మండల పరిధిలోని మంచికంటి నగర్ గ్రామానికి చెందిన కార్తిక్ మణుగూరులో బుధవారం ఆత్మహత్య చేసుకోగా.. జగ్గారం గ్రామంలో మృతుడి అక్క నివాసంలో కార్తిక్ మృతదేహానికి ఎంపీపీ ముత్తినేని సుజాత నివాళులు అర్పించారు. కార్తిక్ కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గొల్లపల్లి నరేష్, వలబోజు మురళి, ఐలపాక వరప్రసాద్, బైగాని శివ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జయంతి

అన్నపురెడ్డిపల్లి: మండలంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భద్రకాళి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రేవతి భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆర్ఐ మధు, రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

దుమ్ముగూడెం: విశారదన్ మహరాజ్ పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభ గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ సతీష్ మహారాజ్ మాట్లాడుతూ.. స్వరాజ్య స్థాపన దళిత శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పాదయాత్ర ముగింపు సభ ఈనెల 30న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ (సరూర్‌నగర్) స్టేడియంలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లు క్రాంతి మహారాజ్, చంటి మహారాజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే తెలంగాణ భరోసా బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన గోడపత్రికలను గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 7వ తేదీన బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు బెహంజి మాయావతి తెలంగాణ భరోసా సభకు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాక వెంకటేశ్వర్లు, బండి రమణి, స్వరూప, మల్లికార్జున్, శివ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు డ్రిల్‌ను వెనక్కి పంపాలి

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని పీకే ఓసీలో ప్రైవేటు సర్ఫేస్ మైనర్ డ్రిల్‌లను వెనక్కి పంపాలని కోరుతూ గురువారం మణుగూరు ఏరియా సీఐటీయూ, ఇఫ్టూల సంయుక్త ఆధ్వర్యంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నేతలు వివి.రత్నం, నాజర్‌పాషాలు మాట్లాడుతూ.. సింగరేణి కాలరీస్ కంపెనీ మణుగూరు ఏరియాలో పీకేఓసీలో గత కొంత కాలంగా ప్రైవేటు సర్ఫేస్ మైనర్‌ను ఓసీ–2లో రెండు ట్రాక్ మౌంటెడ్, మల్టిబుల్ ప్రైవేట్ డ్రిల్స్‌ను ప్రవేశపెట్టారని, వాటిని వెంటనే యాజమాన్యం వెనక్కి పంపాలని అన్నారు. లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి యాజమాన్యం బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ వై.రాంమూర్తి, ఐఎఫ్‌టీయూ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా కూడలి



మండల కేంద్రంలోని రహదారి కూడలి ప్రమాదభరితంగా మారింది. నిత్యం ఇక్కడికి అనేక మంది పనుల నిమిత్తం వస్తూ ఉంటారు. సత్తుపల్లి, పెనుబల్లి వైపు వెళ్లే ఇసుక, యాష్ లారీలు నిత్యం పదుల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో మండల కేంద్రం వద్ద ఉన్న కొత్తగూడెం వైపు వెళ్లే రహదారి కూడలి ప్రాంతం ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ ప్రాంతంలో అనేక మంది ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. సాయంత్ర సమయంలో వాహనాల రద్దీ పెరగడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. పోలీసు శాఖ వారు రహదారి కూడలిలో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: షాహీన, ఎస్సై, అన్నపురెడ్డిపల్లి
ఫోన్ నంబర్: 9440904244